క్లుప్తంగా

ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుజాత తదితరులు

మహారాణిపేట : ఏపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2024 డైరీని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ డి.సుజాత ఆవిష్కరించారు. బుధవారం ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి పి.ఎం.జవహర్‌లాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.రమణ, వి.రాజేశ్వరి, సిటీ కోశాధికారి ఆర్.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఇండోట్రాక్ ట్రాక్షన్ యూనిట్ ప్రారంభం



ట్రాక్షన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్ ఫిజియోథెరపీ అవుట్ పేషెంట్ విభాగానికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నార్త్ ఈస్ట్ వనితా గ్రూప్ ఇండోట్రాక్ ట్రాక్షన్ యూనిట్‌ను విరాళంగా అందజేసింది. బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ దీనిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. మెడనొప్పులు, వెన్నునొప్పి నివారణకు ఈ యూనిట్ ఉపకరిస్తుంది. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, లయన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ వనితా గ్రూప్ సభ్యులు, ఫిజియో థెరపిస్టులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మానవ వికాసం



విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

కంచరపాలెం : మానవ వికాసం, మనుగడ మాతృభాషతోనే సాధ్యమని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, అంతర్ కళాశాలల అకడమిక్ విభాగం నేతృత్వంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షైజీ మాట్లాడుతూ మాతృభాషలో పట్టు సాధించిన విద్యార్థులు విద్యారంగంలో బాగా రాణిస్తారని తెలిపారు. సుమారు 12 కళాశాలలకు చెందిన విద్యార్థులు వేడుకల్లో భాగస్వాములయ్యారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ వీణా స్పందన, సిస్టర్ జైన్ థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్. దీప్తి, డాక్టర్ గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ అనంతరం కల్యాణం, పట్టాభిషేకం 1.30 గంటల వరకు జరిపారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 21 వరకు పది రోజుల పాటు శ్రీమద్రామయణ పారాయణం నిర్వహించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పేదల పొదరిళ్లు

'మేడంటే మేడా కాదు.. గూడంటే గూడూ కాదు.. పదిలంగా అల్లుకున్న పొదరిల్లు మాది'అని ఇక మీదట పేదలు నిశ్చింతగా పాడుకోవచ్చు. ఎందుకంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నిజం చేశారు. వారికి ఉచితంగా ఇళ్లు ఇవ్వటమే కాకుండా ఆ ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు కూడా చేసి అందజేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలోని జోన్–4లో పండగలా ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

- ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లతో జోన్–4లో పండుగ వాతావరణం
- జగనన్న ద్వారా సొంతింటి కల నెరవేరిందని అక్కచెల్లెమ్మల హర్షం



జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్న జోన్–4 సచివాలయ ఉద్యోగులు

జగదాంబ : ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తూ పేదల బతుకుల్లో నవ్యకాంతులు నింపుతున్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు అనుభవించడానికి పేదలు ఎంత మాత్రం అనర్హులు కాదంటూ సర్వ సౌఖ్యాలు వారికి కల్పిస్తున్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, వారి పిల్లలకూ అదే స్థాయి విద్య అందిస్తూ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. పేదవాడు పేదవాడిగానే ఉండిపోకూడదని.. సగౌరవంగా వాళ్లు కూడా బతికేలా భరోసా కల్పిస్తున్నారు. పేదల సొంతింటి కల నిజమయ్యేలా వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఉచితంగా అందజేస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ఇచ్చే ఉచిత ఆస్తిపై పూర్తిగా వారికే హక్కుండేలా ఇళ్ల పట్టాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నారు. దీంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. తమ బాగోగులు చూసే నిజమైన నాయకుడు జగనన్న అని కొనియాడుతున్నారు.

పండగ వాతావరణం..

పేదల కోసం జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం కూడా వేగం పుంజుకుంది. జీవీఎంసీ జోన్–4 పరిధిలో ఉన్న సచివాలయాల్లో ఈ ప్రక్రియ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్లు జరిగే చోట పండగ వాతావరణం వెల్లివిరుస్తోంది. పేదలు కుటుంబ సమేతంగా రిజిస్ట్రేషన్లు జరిగే ప్రదేశానికి విచ్చేసి సంతోషంగా పట్టాలతో వెనుదిరుగుతున్నారు.



పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న లబ్ధిదారులు



రిజిస్ట్రేషన్‌తో సంపూర్ణ హక్కు..

గత ప్రభుత్వాలు అరకొరగా ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ వాటిపై సంపూర్ణ హక్కు కల్పించిన దాఖలాలు లేవు. దేశంలోనే తొలిసారిగా జగనన్న ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు కల్పిస్తోంది. గత ప్రభుత్వాలు ఒక వేళ కొద్దో గొప్పో ఇళ్లపట్టాలు ఇచ్చినప్పటికీ కావాలనుకుంటే వాటిని రద్దు చేసే అధికారం వాటికి ఉండేది. జగనన్న ప్రభుత్వం మాత్రం ఒకసారి పేదలకు మంజూరు చేసిన ఇళ్లు పూర్తిగా వారి హక్కులోనే ఉండేలా చర్యలు తీసుకుని పేదలను లక్షాధికారులను చేసింది.

అధికారుల పర్యవేక్షణలో..

జీవీఎంసీ జోన్–4 పరిధిలోని 68 సచివాలయాల్లో గంగవరం, సంగినారపాడు, అస్కపల్లిలోని మూడు లేఅవుట్లలో మొదటి విడతగా 13,149, రెండవ విడతలో 480 ఇళ్లస్థలాలను పేదలైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారందరికీ ప్రభుత్వం ఈనెల 10వ తేదీ నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టింది. ఇప్పటి వరకు జోన్ పరిధిలో వెయ్యికి పైగా రిజిస్ట్రేషన్లు చేశారు. సచివాలయ కార్యదర్శి, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్ లబ్ధిదారులకు ఈకేవైసీ ద్వారా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి దస్తావేజులు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ ప్రక్రియను జోనల్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, తహశీల్దార్ ఎంవీ రమణ పర్యవేక్షిస్తున్నారు.

సొంతింటి కల నెరవేరింది..



ఎట్టకేలకు మా సొంతింటి కల నెరవేరింది. మా ఇళ్లకు ఎటువంటి డబ్బు తీసుకోకుండా రిజిస్ట్రేషన్ చేశారు. దీని వలన అవసరం అయితే బ్యాంక్ లోన్లు కూడా తీసుకోవచ్చు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని గుర్తించి మాకు ఒక దారి చూపించారు. ఆయన దయ వల్ల ఇప్పుడు మా సొంతింటి కల నెరవేరింది. మా జీవితాలకు భరోసా దక్కింది.

– రాజేశ్వరి, లబ్ధిదారు, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

అంతా జగన్‌బాబు చలవే..



మాలాంటి పేదలు బతుకుతున్నారంటే అది జగన్‌బాబు చలవే. పేదలను ఆదుకోవాలంటే ఆయన తర్వాతే ఎవరైనా. ఇళ్ల రిజిస్ట్రేషన్ ద్వారా వారసత్వ హక్కు కలిగింది. ముఖ్యమంత్రి అయిన దగ్గర నుండి పేదలకు ఏదో ఒకటి చేద్దామని తపన పడే జగన్‌బాబే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. అప్పుడే పేదలకు న్యాయం జరుగుతుంది. ఆయన పాలనలో పేదలు కూడా బతగ్గలరు.

– నాయిని సంతోషమ్మ, పండావీధి, 35వ వార్డు

రిజిస్ట్రేషన్ పక్రియ వేగవంతం చేస్తున్నాం..



జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేస్తున్నాం. అన్ని సచివాలయాల్లో ప్రక్రియ జరుగుతోంది. కొన్ని చోట్ల సర్వర్లు డౌన్ అవుతున్నా లబ్ధిదారులు సహనం కోల్పోకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఈ ప్రక్రియ మరింత వేగవంతం చేసేందుకు తహశీల్దార్‌తో కలిసి పర్యవేక్షిస్తున్నాం. రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వం అందజేసే ఆస్తికి లబ్ధిదారు సంపూర్ణ హక్కుదారు అవుతాడు.

– పి.వి.వి.డి ప్రసాదరావు, జీవీఎంసీ జోన్–4 కమిషనర్

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



శ్రీఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రి భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం కూడా ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు పసుపు నీళ్లతో జలాభిషేకం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కళ్ల సంరక్షణపై విద్యార్థులకు శ్రద్ధ అవసరం

ఆరిలోవ: పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కళ్ల సంరక్షణపై శ్రద్ధ చూపాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి చైల్డ్ సైట్ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ అల్లూరి హిమబిందు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు డిజిటల్ విధానంలో స్క్రీన్ చూస్తూ అభ్యసిస్తున్నారని, పుస్తకాలను ఎక్కువ సమయం ఒత్తిడితో చదవడం వల్ల కంటికి అలసట వస్తుందన్నారు. దీని ఫలితంగా కళ్లు పొడిబారడం, తల నొప్పి రావడం, దృష్టిలో అస్పష్టత, తలలో పార్శ్వ నొప్పి(మైగ్రేన్) తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులు పరీక్షలకు కొద్ది రోజుల ముందు వైద్యులను సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకుని, సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు చదువుతున్నప్పుడు ప్రతి 20 నిమిషాలకు 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో పుస్తకంలో అక్షరాలను చూడాలన్నారు. చదువుతున్నప్పుడు తరచూ కంటి రెప్పలు మూస్తూ, తెరుస్తుండాలన్నారు. ఎయిర్ కండిషన్, కూలర్లు, ఫ్యాన్లకు ఎదురుగా ఉండి చదవకూడదని, గాలి, వెలుతురు బాగా ఉండే గదులలో చదవాలని ఆమె సూచించారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



కండువా కప్పి అశోక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

డాబాగార్డెన్స్ : జనసేన పార్టీ యువ నాయకుడు బేరా అశోక్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కండువా కప్పి అతన్ని పార్టీలోకి ఆహ్వానిచారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీలోనే సీనియర్ యువ నాయకుడిగా ఉన్నప్పటికీ ఇటీవల జనససేనలో చేరినట్లు తెలిపారు. అయితే అక్కడ నిలకడలేని అంశాలు నచ్చక తిరిగి జగన్‌మోహన్ రెడ్డి పార్టీలోనే చేరాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేస్తున్న సేవలు, కష్టపడి పని చేసే వారికి ఇచ్చే గుర్తింపుతో ఆయన సమక్షంలో పార్టీలో చేరానని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఎమ్మెల్యే వాసుపల్లిని గెలిపించుకుంటామని ఈ సందర్భంగా అశోక్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మేలో ప్రపంచ గవర మహా సభలు

డాబాగార్డెన్స్ : ఈ నెలలో జరగాల్సిన ప్రపంచ గవర మహాసభలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చార్టర్డ్ అకౌంటెంట్ ఏవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా డాబాగార్డెన్స్‌లో గల తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ప్రపంచ గవర మహాసభలు జరిపేందుకు అవకాశం తక్కువగా ఉన్నందున మేలో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న గవర జాతీయులు ఈ విషయాన్ని గమనించాలని రమణ విజ్ఞప్తి చేశారు.

'ఫోర్జరీ ఇంటి పట్టాల స్కాంపై దర్యాప్తునకు వెనుకడుగు'

డాబాగార్డెన్స్ : ఫోర్జరీ ఇంటి పట్టాల స్కాంపై దర్యాప్తునకు జీవీఎంసీ అధికారులు వెనుకడుగు వేస్తున్నారని ఆర్‌టీఐ యాక్టివిస్ట్ రెడ్డి వెంకట్రావు ఆరోపించారు. జోన్–5 రెవెన్యూ విభాగంలో 132 ఇళ్ల పట్టాల ఫోర్జరీకి పాల్పడినట్టు ఆర్‌టీఐ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆధారాలతో బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భవనాలు నిర్మించుకుని ఇంటి పన్ను వేయమని దరఖాస్తు చేసుకున్నా, అర్థం కాని సాంకేతిక పదాలతో కొర్రీలు వేస్తూ తిరస్కరిస్తుంటారని తెలిపారు. అధికారుల ముందు తమ బాధ తెలియజేయాలని వెళ్తే మరోసారి దరఖాస్తు చేసుకోమని సలహా ఇస్తుంటారని, దరఖాస్తుదారులు సచివాలయం, జోనల్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కొన్ని నెలల పాటు పన్ను విధించుకోలేని పరిస్థితి ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేసినా ఆక్రమణదారులు కొద్ది రోజుల్లోనే నకిలీ ఇంటి పట్టాలతో ఇంటి పన్నుల పేరు మార్పు చేసి, జోన్–5లోని కొందరు రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



వన్‌టౌన్ ప్రధాన రహదారిని శుభ్రం చేయిస్తున్న జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : పాతనగరం ప్రధాన రహదారి విస్తరణ నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు నుంచి 39వ వార్డు వరకు వన్‌టౌన్ ప్రధాన రహదారిలో పర్యటించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్న వైనం గమనించి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో మాట్లాడారు. రహదారి పనులు జరుగుతున్నప్పటికీ పరిశుభ్రత లోపించకూడదన్నారు. రోజూ ఉదయాన్నే ముందుగా ప్రధాన రహదారిపై దృష్టి సారించి సిబ్బందితో పరిశుభ్రం చేయించాలన్నారు. మురుగు నీరు రహదారిపై ప్రవహించకుండా కాంట్రాక్టర్లతో మాట్లాడి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తకుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న డెబ్రిస్‌ను కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు తొలించాలన్నారు. ఇందుకు శానిటరీ సెక్రటరీలు ఆయా కాంట్రాక్టర్లతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్‌బోర్డ్ ప్రమాణ స్వీకారం



సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు టర్నర్‌చౌల్ట్రీ నుంచి ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు. కోలాటం, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ సాగింది. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన సత్యనారాయణ స్వామి దేవస్థానం ప్రతిష్ట మరింత పెంచే విధంగా అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెంటపల్లి వెంకట్, చింతపల్లి సత్యవతి, బెవర దేవి మహేష్, చిన్నా శ్రీధర్, బెరా అశోక్, మానేపల్లి రమణి, బుడ్డిగ మాధవి, ఫణిహార నరసింహమూర్తితో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం ట్రస్టుబోర్డు చైర్మన్ కొరిపల్లి ఆనంద్ మాట్లాడుతూ కష్టపడిన వారిని గుర్తించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తామంతా కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, 36వ వార్డు నాయకుడు మాసిపోగు రాజు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పెంటపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పీతల వాసు, జెర్రిపోతుల ప్రసాద్, వద్దాది దిలీప్, నీలాపు లక్ష్మి, దశమంతుల మాణిక్యాలరావు, సనపల రవీంద్ర, కాకి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి మల్లీశ్వరి

సీతంపేట: మతోన్మాద శక్తులు అధికారం చేపడితే ఎదురయ్యే ప్రమాదం గత పదేళ్లుగా కనిపిస్తోందని రచయిత్రి కె.ఎన్.మల్లీశ్వరి అన్నారు. రెడ్ బుక్స్ డేను పురస్కరించుకుని మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఫాసిజం మూలాలు' అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించి పాఠ్యాంశాలుగా ప్రవేశపెడుతున్నారన్నారు. మతోన్మాదాన్ని పెంచి హిందువులను ఓటు బ్యాంకుగా మలుచుకోవడంలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇప్టా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సి.ఎస్.క్షేత్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం గెడ్డవీధిలో నివాసం ఉంటున్న ఇరోతి లూర్దు అనారోగ్యంతో సెయింట్ జోసెఫ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం స్థానిక వలంటీర్ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుని భార్యకు రూ. 5 వేల నగదు అందజేశారు. వార్డులో పేదోలకు ఎలాంటి సమస్య వచ్చినా వైఎస్సార్‌సీపీ నుంచి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వెళంగిణిరావు, శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న పల్లంట్ల వెంకటరమణ

డాబాగార్డెన్స్ : తెలగాలను బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఈ నెల 25న పూసపాటిరేగలో నిర్వహించనున్న బహిరంగ సభ విజయంతం చేయాలని ఉత్తరాంధ్ర తెలుగు సంఘం సభ్యుడు పల్లంట్ల వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని కోరారు. 24 రోజుల పాటు 668 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి రాజకీయ పార్టీల నాయకులను కలిసి మొరపెట్టుకున్నామన్నారు. సమావేశంలో మంగరాజు, గొల్లకోట సుబ్బారావు, అప్పన్న, స్వరబత్తుల అప్పారావు, ఎస్ఎన్ మూర్తి, మహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.

సత్యసాయినగర్‌లో అన్నదానం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్‌లో శ్రీసత్యసాయి సంక్షేమ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో విజయదుర్గాదేవి ఆలయ 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు, బొడ్డేటి శ్రీనివాస్, పి.ఎస్.రామారావు, లింగంపల్లి రవిశంకర్, వాసుపల్లి ఎల్లాజీరావు, తిప్పానా ఆదినారాయణ, మడక పైడిబాబు, కారుకొండ కనకరాజు, కె.సూరిబాబు, యు.రమణ, వెంకట్, శ్రీను, సూరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పూలను శ్రీవారికి నివేదించిన దృశ్యం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రత్తాళ్వార్‌తో భక్తులు అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానం చేసి తరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శ్రీవారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పుష్పాలు తొలుత స్వామివారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.